సాక్షి వనపర్తి
శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



గంగాపురం.. జనసంద్రం

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో గంగాపురం జనసంద్రంగా మారింది.

వివరాలు IIలో ▸



సవాల్‌కు సిద్ధమా?

'పాలమూరు' పనులు 80 శాతం పూర్తయితే చూపాలని వంశీచంద్‌రెడ్డి సవాల్ విసిరారు.

వివరాలు IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.5 /13.7

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి.. ఉదయం, రాత్రి చలి కాస్త పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రేపు సీఓఈ ప్రవేశ పరీక్ష

వనపర్తిటౌన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీలో ప్రవేశాలకు జిల్లాకేంద్రంలోని మర్రికుంట గిరిజన గురుకుల ప్రతిభా కళాశాలలో ఆదివారం పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఐ.గోవర్ధన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 347 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని.. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందని.. విద్యార్థులు ఉదయం 8 వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్‌టికెట్, ఆధార్ కార్డులు వెంట తీసుకురావాలని సూచించారు.

మహిళా సమస్యల పరిష్కారానికి కృషి



వనపర్తిటౌన్: బాలికలు, యువతులు, మహిళలకు ప్రభుత్వం అండగా ఉంటూ వారి సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు భరోసా, సఖి కేంద్రాలను ఏర్పాటు చేసిందని జిల్లా మహిళ, శిశుసంక్షేమశాఖ అధికారి రామమహేశ్వర్‌రెడ్డి తెలిపారు. అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశాల మేరకు శుక్రవారం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు భరోసా, సి.హబ్, సఖికేంద్రాలను చూపించి ఆయా కేంద్రాలు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే షీటీం, సఖి కేంద్రం, 181 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ మధ్యకాలంలో విద్యార్థినులు, మహిళలను సామాజిక మాధ్యమాల్లో ఇబ్బందులకు గురి చేస్తున్నారని జాగ్రత్తగా ఉండాలన్నారు. జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం మిషన్ కో–ఆర్డినేటర్ భాస్కర్, వాణి, సలోమి, సుమ, భరోసా కేంద్రం కో–ఆర్డినేటర్ శిరీష, షీటీం అధికారి శ్రీనివాస్, సఖికేంద్రం సభ్యులు కృష్ణయ్య, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్‌కు సన్మానం

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపోలో విధులు నిర్వర్తిస్తున్న పెద్దమందడి మండలానికి చెందిన జయరాములు ఉత్తమ డ్రైవర్‌గా ఎంపికయ్యారు. శుక్రవారం ప్రమాదరహిత దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎం వేణుగోపాల్, సీఐ దేవేందర్‌గౌడ్ జయరాములును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. 27 ఏళ్లకు పైగా డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తూ ప్రయాణికులను సురక్షితగా తమ గమ్యస్థానాలకు చేర్చారని కొనియాడారు. కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుడు దామోదర్‌రెడ్డి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

1,018 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం నీటిమట్టం 1,018 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రణీల్‌రెడ్డి తెలిపారు.

మహర్దశ..

గ్రామాల్లో జోరుగా సీసీ రహదారుల నిర్మాణాలు



ఖిల్లాఘనపురం మండలం కమాలోద్దీన్‌పూర్‌లో సీసీ రహదారి నిర్మాణం

- జిల్లావ్యాప్తంగా 713 పనులు.. రూ.29.27 కోట్లు కేటాయింపు
- అత్యధికంగా పాన్‌గల్ మండలానికి రూ.3.10 కోట్లు
- మార్చి 31 చివరి గడువు
- ఎమ్మెల్యేల ప్రత్యేక చొరవతోనే నిధులు మంజూరు

వనపర్తి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కాంపోనెంట్ నిధులతో ఏటా చేపట్టే సీసీ రహదారి నిర్మాణాలకు ఈసారి ఎక్కువ మొత్తంలో నిధుల కేటాయింపు 20 రోజుల ముందుగానే పూర్తిచేశారు. ఆయా పనులు మార్చి 31 నాటికి పూర్తి చేయాల్సి ఉండటంతో ఇప్పటికే జిల్లాలోని పలు గ్రామాల్లో పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఎమ్మెల్యేలు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు జనవరి చివరి వారంలోనే ఆయా గ్రామాల్లో రహదారుల నిర్మాణాలకు సంబంధించిన గ్రామసభల తీర్మానం, అంచనాలను పంచాయతీ రాజ్ ఇంజినీర్లతో పట్టుబట్టి చేయించారు. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు జిల్లా యూనిట్‌గా గత ఏప్రిల్ నుంచి చేసిన కూలీల పనుల విలువ ఆధారంగా 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ నిధులను సీసీ రోడ్ల నిర్మాణాలకు వినియోగించుకునేందుకు అనుమతినిచ్చారు.



గోపాల్‌పేట మండలం చెన్నారంలో..

జిల్లావ్యాప్తంగా 713 పనులు..

జిల్లాలోని 14 మండలాల పరిధిలోని 255 గ్రామపంచాయతీల్లో 713 సీసీ రహదారులకు తీర్మానాలు వచ్చినట్లు అధికారుల లెక్కలతో స్పష్టమవుతోంది. అత్యధికంగా మంత్రి జూపల్లి కృష్ణారావు నియోజకవర్గ పరిధిలోని పాన్‌గల్ మండలంలో 98 పనులకుగాను రూ.3.10 కోట్లు.. అత్యల్పంగా వనపర్తి నియోజకవర్గంలోని రేవల్లి మండలంలో 19 పనులకు రూ.1.31 కోట్లు కేటాయించారు.

పెండింగ్ బిల్లులకు మోక్షమెప్పుడో..?

గతేడాది ఉపాధి నిధులతో చేపట్టిన సీసీ రహదారి పనులకు సంబంధించిన చెల్లింపులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. నిధుల విడుదలపై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు గ్రామీణాభివృద్ధి అధికారులకు ఎనిమిది నెలలుగా పలుమార్లు లేఖలు రాసినా.. స్పందన లేకపోవడం గమనార్హం. జిల్లాలో కొత్తగా సీసీ రహదారి నిర్మాణాలు ప్రారంభమైనా.. గతేడాది బిల్లులు ఇవ్వకపోవడం శోచనీయమని పలువురు వాపోతున్నారు.

మండలాల వారీగా పనులు, నిధుల కేటాయింపు వివరాలు..

మండలం	పనులు	మంజూరైన నిధులు (రూ. కోట్లలో..)
పాన్‌గల్	98	3.10
కొత్తకోట	90	2.69
మదనాపురం	71	2.43
ఖిల్లాఘనపురం	56	2.68
పెద్దమందడి	57	2.50
వీపనగండ్ల	55	1.70
చిన్నంబావి	44	1.80
పెబ్బేరు	43	2.07
వనపర్తి	42	2.46
గోపాల్‌పేట	42	2.38
ఆత్మకూరు	37	1.40
అమరచింత	32	1.40
శ్రీరంగాపూర్	27	1.35
రేవల్లి	19	1.31
మొత్తం	713	29.27

నాణ్యతగా నిర్మాణాలు..



ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేపట్టే సీసీ రహదారి పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయా మండలాల ఏఈలు నిత్యం పనులు పర్యవేక్షించాలని ఆదేశించాం. గ్రామసభల్లో చేసిన తీర్మానాల మేరకు ఆయా పనులకు అంచనాలు వేశాం. ఎమ్మెల్యేలు ప్రత్యేక చొరవతో గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రితో నిధుల కేటాయింపులు మునుపటికంటే ముందే చేయించుకున్నారు.

– మల్లయ్య,
ఈఈ, పంచాయతీరాజ్‌శాఖ, వనపర్తి

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ పవార్



సమావేశానికి హాజరైన ప్రత్యేక అధికారులు

- కలెక్టర్ తేజస్ పవార్

కొత్తకోట రూరల్: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ తేజస్ పవార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఐడీఓసీ ప్రజావాణి మందిరంలో ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎక్కడైనా చిన్నచిన్న సమస్యలు ఉంటే గ్రామపంచాయతీ నిధులతో పూర్తిచేసి నీటిని ప్రతి ఇంటికి అందించాలని సూచించారు. సమస్యలను సోమవారంలోపు గుర్తించి మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హరితహారంలో భాగంగా గ్రామాల్లోని వన నర్సరీల్లో మొక్కలు తక్కువగా ఉన్న చోట పెంచాలని.. కనీసం 90 శాతం ఉండేలా చూసుకోవాలన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచాలంటే కుంటలు, చెరువులతో పాటు కాల్వల్లో పూడికతీత , అటవీ భూముల్లో పనులు చేపట్టాలని సూచించారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి సంబంధించి ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మొదటి స్థాయి పూర్తి చేస్తే తర్వాత స్థాయిలో కలెక్టర్ లాగిన్‌కు చేరుతుందని తెలిపారు. దీనికి సంబంధించి తుది గడువంటూ ఏదీ లేదని కలెక్టర్ వివరించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఆర్డీఓ ఉమాదేవి, జెడ్పీ సీఈఓ యాదయ్య, అదనపు డీఆర్డీఓ నాగేంద్ర, మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి, డీపీఓ, ఎంపీఓలు, ఏపీఓలు, డీఎల్‌పీఓలు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ



డీఎస్పీ వెంకటేశ్వరరావు

వనపర్తిటౌన్: వనపర్తి డీఎస్పీగా జె.వెంకటేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో ఇక్కడ పనిచేసిన డీఎస్పీ ఆనంద్‌రెడ్డి వేరే ప్రాంతానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో వెంకటేశ్వర్‌రావు ఇక్కడికి వచ్చారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతానికి చెందిన వెంకటేశ్వరరావు 1995లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా నిజామాబాద్, హైదరాబాద్‌లో.. కొత్తకోట సీఐగా విధులు నిర్వర్తించి తిరిగి హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. రెండేళ్ల కిందట నారాయణపేట డీఎస్పీగా పదోన్నతిపై వచ్చిన ఆయన అదే జిల్లాలో డీసీఆర్‌బీగా పనిచేసి అక్కడి నుంచి జిల్లాకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రక్షిత కె.మూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులతో గౌరవంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా విధు లు నిర్వర్తించాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, అధికారులు

వనపర్తిటౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఏఎంఓ మహానంది, డీసీసీబీ చైర్మన్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని బాలభవన్‌లో ఎన్జీసీ కో–ఆర్డినేటర్ ఐ.సుదర్శన్‌రావు ఆధ్వర్యంలో 'సింగిల్‌యూజ్ ప్లాస్టిక్.. ప్రత్యామ్నాయ మార్గాలు' అనే అంశంపై విద్యార్థులకు జిల్లాస్థాయి మోనో యాక్షన్ (ఏకపాత్రాభినయం), గ్రూప్ యాక్షన్ (సామూహిక నటన) పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ప్లాస్టిక్‌ను అధికంగా వినియోగిస్తుండటంతో అనేక అనర్థాలకు దారితీస్తోందని, గాలి, నీరు, నేల మొదలైన వాటిని కలుషితం చేస్తోందని వివరించారు. వాటి అవశేషాలు ఆహారపు గొలుసు ద్వారా జీవి శరీరాల్లోకి ప్రవేశించి, వాటి ద్వారా మానవ శరీరాల్లో చేరి క్యాన్సర్, వివిధ హానికరమైన వ్యాధుల బారినపడేలా చేస్తాయన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత చేతిసంచులు వినియోగించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఆక్సిజన్ ప్రాముఖ్యత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో అనర్థాలు, ప్రత్యామ్నాయ మార్గాలపై నాటకాలు ప్రదర్శించారు. మోనో యాక్షన్‌లో మొదటి బహుమతి ఎం.కార్తీక్ (7వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్ పెద్దమందడి), రెండో బహుమతి భానుప్రియ (8వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్ చెన్నారం), మూడో బహుమతి నవీన్ (8వ, తరగతి, జెడ్పీహెచ్‌ఎస్ సోలీపూర్), గ్రూప్ యాక్షన్‌లో మొదటి బహుమతి (జెడ్పీహెచ్‌ఎస్ బాలికలు ఆత్మకూర్), రెండో బహుమతి (జెడ్పీహెచ్‌ఎస్, జగత్‌పల్లి), మూడో బహుమతి (జెడ్పీహెచ్‌ఎస్ బాలుర వనపర్తి) విద్యార్థులు సాధించారు. న్యాయ నిర్ణేతలుగా జీహెచ్‌ఎం శంకరయ్య, అధ్యాపకుడు బాబురావు వ్యవహరించారు. రాష్ట్ర ఎన్జీసీ ప్రాజెక్టు అధికారి రాజశేఖర్, జీహెచ్‌ఎంలు ప్రభాకర్, ఉమాదేవి, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈ–చలాన్స్ ఆదాయం.. రూ.8.91 కోట్లు

- రాయితీలను సద్వినియోగం చేసుకున్న 6,17,639 వాహనదారులు
- అత్యధికంగా పాలమూరులో.. అత్యల్పంగా నారాయణపేటలో వసూలు



ఈ–చలాన్ చెల్లిస్తున్న వాహనదారుడు

మహబూబ్‌నగర్ క్రైం: వాహనదారులు పెండింగ్‌లో ఉన్న ఈ–చలాన్ జరిమానాలను చెల్లించడంతో ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరింది. రాష్ట్రవ్యాప్తంగా గతేడాది డిసెంబర్ 27 నుంచి ఈ నెల 15 వరకు ప్రత్యేక రాయితీ కార్యక్రమం నిర్వహించింది. రాష్ట్ర పోలీస్ శాఖ పెండింగ్‌లో ఉన్న ఈ–చలాన్స్‌పై ఆర్టీసీ బస్సులపై 90 శాతం, ద్విచక్ర వాహనాలపై 80 శాతం, ఆటోలు, కార్లు ఇతర ఫోర్ వీలర్స్‌పై 60 శాతం, లారీలు, ఇతర భారీ వాహనాలపై 50 శాతం రాయితీ కల్పించింది. అయితే ఈ రాయితీలను అత్యధికంగా ద్విచక్రవాహనదారులు సద్వినియోగం చేసుకోగా.. ఆ తర్వాత కారు యజమానులు సైతం పెండింగ్ చలాన్స్ చెల్లించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పరిశీలిస్తే అత్యధికంగా మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రూ.3 కోట్లు ఈ–చలాన్ జరిమానాలు వసూలు కాగా.. అత్యల్పంగా నారాయణపేట నుంచి రూ. 86 లక్షలు వసూలయ్యాయి. ఇక ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల్లో ఈ ప్రత్యేక డ్రైవ్ రాయితీలను 6,17,639 మంది వాహనదారులు సద్వినియోగం చేసుకోవడం జరిగింది. వీరి నుంచి ప్రభుత్వానికి రూ.8,91,74,750 నగదు ఆదాయం వచ్చింది.

ఉమ్మడి జిల్లాలో చెల్లించిన ఈ–చలాన్ వివరాలు

జిల్లా	ఈ–చలాన్ కేసులు	సమకూరిన నగదు (రూ.లలో..)
మహబూబ్‌నగర్	2,61,307	3,10,95,585
వనపర్తి	1,13,545	1,64,94,810
నాగర్‌కర్నూల్	92,774	1,43,32,405
గద్వాల	89,975	1,86,05,085
నారాయణపేట	60,038	86,46,865

అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఎం.నగేష్

వనపర్తిటౌన్: జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్‌గా ఎం.నగేష్‌ను నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ అయిన నగేష్ గత కొంత కాలం వెయిటింగ్‌లో ఉన్నారు. ఇదిలా ఉండగా ఇంతవరకు పనిచేసిన అదనపు కలెక్టర్ తిరుపతిరావు, డీఆర్డీఓ నర్సింహులు, మరో అధికారి రేణుక బదిలీ కావడంతో గురువారం రాత్రి కలెక్టర్ తేజస్ పవార్ కలెక్టరేట్‌లో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కలెక్టర్ కొనియాడారు. తిరుపతిరావు అసెంబ్లీ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారిగా సమర్థవంతంగా విధులు నిర్వర్తించారన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత గంగ్వార్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి పుర కమిషనర్‌గా ఎం.పూర్ణచందర్

వనపర్తి పుర కమిషనర్‌గా ఎం.పూర్ణచందర్‌ను నియమిస్తూ పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. పూర్ణచందర్ సూర్యాపేట జిల్లాలోని మిర్యాలగూడ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. ఈ నెల 12న చౌటుప్పల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డిని, తర్వాత జల్‌పల్లి మేనేజర్ నియమించినా వారు విధుల్లో చేరకపోవడంతో ప్రభుత్వం మూడోసారి పూర్ణచందర్ పేరు ఖరారు చేసింది.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో సెక్యూరిటీ గార్డ్ (పురుషుడు)గా తాత్కాలిక పద్ధతిన పనిచేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎస్.పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని.. ఈ నెల 20 సాయంత్రం 5 గంటలలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఉచిత ప్రయాణం రద్దు చేయాలంటూ ర్యాలీ



ర్యాలీలో ఆటోడ్రైవర్లు, యజమానులు, సంఘం సభ్యులు

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఒకటైన మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం కొత్తకోటలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తూ తమకు ఉపాధి లేకుండా చేశారని, గతంలో రోజుకు రూ.500 వరకు సంపాదించుకునే వారమని.. ప్రస్తుతం రూ.200 కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగైతే తమ కుటుంబాలు ఎలా గడుస్తాయని, పిల్లలను ఎలా చదివించుకోవాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రెండు నెలలుగా తాము ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నామని.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధచూపి జీవనభృతి కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌గౌడ్, బాలకుర్మన్న, ఆసీఫ్, వెంకటేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా పోరాటం



జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు

పెబ్బేరు రూరల్: కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మతోన్మాద విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు పిలుపునిచ్చారు. దేశవ్యాప్త గ్రామీణబంద్‌లో భాగంగా శుక్రవారం సీఐటీయూ, ఇఫ్టూ, ఏఐటీయూసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల నుంచి ప్రధాన వీధుల మీదుగా మర్రికుంట ధర్నాచౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన బహిరంగ సమావేశంలో పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీ యూ జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు చేయలేదని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలంటూ మోసం చేసిందని విమర్శించారు. 100 రోజుల్లో ధరలు తగ్గిస్తామని చెప్పి 243 శాతం పెంచారని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి పేదవాడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని మోసగించిందని తెలిపారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో కేంద్ర సర్కార్ కార్పొరేట్ టాక్స్ రూ.12 లక్షల కోట్లు మాఫీ చేసిందని, 2023లోనే రూ.2.14 లక్షల కోట్లు, బ్యాంకు అప్పులు రూ.15 లక్షల కోట్లు కార్పొరేట్లకు మాఫీ చేసిందని వివరించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోషా మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి యాజమాన్యానికి అనుకూలంగా చట్టాలు తెచ్చారని విమర్శించారు. ఉపాధి కూలీలకు నేటికి రోజు కూలి రూ.150 పడుతుందని, అది మూడు నెలలకు ఓసారి కూడా రావడం లేదన్నారు. పంటలకు మద్దతు ధర స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తానని మోసం చేశారని చెప్పారు. 2024 ఎన్నికల్లో బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు పరమేశ్వరాచారి, గంధం మదన్, డి.కురుమయ్య, కవిత, జ్యోతి, సుమతి, గడ్డం కురుమయ్య, యాదగిరి, గణేష్, గోపాలకృష్ణ, విజయరాములు, విమల, లక్ష్మమ్మ, బాబుసాగర్, రాములు, ముంత రాములు, రామచంద్రయ్య, ఖాజాపాషా, గోవిందమ్మ, మజీద్, విమల, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలం నాగసానిపల్లి ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న భవిత కేంద్రాన్ని శుక్రవారం ఐఈ కో–ఆర్డినేటర్ యుగంధర్, ఎంఈఓ జయరాములు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రత్యేక అవసరాల విద్యార్థులకు అందుతున్న బోధన, స్పీచ్ థెరపీ గురించి ఆరా తీశారు. అలాగే ప్రతి శనివారం నిర్వహించే హోం బెస్ట్ ఎడ్యుకేషన్ గురించి విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తెలుగు, ఆంగ్లంలో రాత నైపుణ్యాలు ఎలా పెంచుకోవాలో టీవీలో విద్యార్థులకు చూపించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అదేవిధంగా వెంకటాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థుల రివిజన్ టెస్ట్‌ను పరిశీలించారు. సులువుగా మార్కులు ఎలా సాధించాలో విద్యార్థులకు సూచనలు చేశారు. వారి వెంట ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు చిన్నరాములు, ప్రదీప్ పాల్గొన్నారు.

గంగాపురం.. భక్తజన సంద్రం

రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు

- రథసప్తమి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు
- స్వామివారి నామస్మరణతో మార్మోగిన ఆలయ ఆవరణ



రథోత్సవంలో భక్తుల సందడి



రథోత్సవంలో పాల్గొన్న అనిరుధ్‌రెడ్డి, వంశీచంద్

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం కూడళ్లు చెన్నకేశవ, గోవింద నామస్మరణతో మార్మోగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన రథోత్సవం, రథసప్తమిని పురస్కరించుకొని శుక్రవారం స్వామివారి దర్శనానికి ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివడంతో ఆలయ ఆవరణ కిటకిటలాడింది. చెన్నకేశవా.. వచ్చామయ్యా అంటూ ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు సత్యనారాయణస్వామి వ్రత మండపంలో సామూహిక వ్రతాలు చేసి తాము పండించిన పంటను కొత్తకుండల్లో వండి దాసంగాలతో నైవేద్యాలు సమర్పించారు. మరికొందరు తలనీలాలు సమర్పించి కోనేటిలో స్నానమాచరించి గండదీపాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులతో దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు కిటకిటలాడాయి. కొందరు భక్తులు గోవులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవం.. స్వామివారి రథోత్సవం

గంగాపురం చెన్నకేశవస్వామి రథోత్సవం శుక్రవారం రాత్రి కనుల పండువలా సాగింది. రంగురంగుల విద్యుద్దీపాలు, రకరకాల పూలతో రథాన్ని అందంగా అలంకరించారు. అర్చకులు బలిహరణం, హోమం జరిపించిన అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై ఉంచారు. గ్రామ విశ్వబ్రాహ్మణుల ఇళ్లకు వెళ్లి మేళతాళాలతో సంప్రదాయబద్ధంగా వారిని ఆలయానికి ఆహ్వానించారు. ఆలయానికి చేరుకున్న వారు స్వామివారి మూల విగ్రహంతో పాటు రథానికి పూజలు చేశారు. అనంతరం భక్తుల గోవింద, చెన్నకేశవ నామస్మరణల నడుమ రథాన్ని ముందుకు లాగారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి దాటే వరకు రథోత్సవం సాగింది.



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



కొత్త పాత్రల్లో చేసిన వంటకాలతో దాసంగాలు పెడుతున్న భక్తులు

ఘనంగా రథసప్తమి వేడుకలు

- సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు
- పురవీధుల వెంట ఊరేగిన సూర్యప్రభ వాహనం



అభిషేకం చేస్తున్న గద్వాల డీఎస్పీ సత్యనారాయణ



సూర్యప్రభ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఆలయ ఈఓ, చైర్మన్

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పట్టణంలో వెలిసిన శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో శుక్రవారం రథసప్తమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, ఉదయాస్తమ సేవలు కొనసాగాయి. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు అలంకరణలు చేశారు. మహానివేదనలు జరిపి హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు. అనంతరం ఆలయం ముందు సూర్యప్రభ వాహనంపై ఉత్సవ మూర్తులను ఆశిస్సులను చేసి ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్న కృష్ణయ్య టెంకాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. సూర్యప్రభ వాహనం పురవీధుల వెంట ఊరేగించారు. భక్తులు ఆలయంలో భజనలు చేశారు.

చండీహోమం, రథోత్సవం

వారోత్సవాల్లో భాగంగా జోగుళాంబ అమ్మవారి యాగశాలలో చండీహోమాలు నిర్వహించారు. అలాగే ప్రదోశ కాలంలో దర్బార్ సేవతో పాటు ఆలయం చుట్టూ రథోత్సవంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం దశ విదహారతులు అందజేసి భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు.

ఆలయాన్ని దర్శించుకున్న ప్రముఖులు

అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను పలువురు అధికారులు దర్శించుకున్నారు. ఇందులో భాగంగా చార్మినార్ ఏసీపీ రుద్రభాస్కర్, గద్వాల డీఎస్పీ వెంకటేశ్వర్లు, అలంపూర్ మున్సిపల్ కమిషనర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన పి.సరస్వతి, అలాగే గద్వాల జిల్లాకు నూతన డీఎస్పీగా బదిలీపై వచ్చిన సత్యనారాయణ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దక్షిణకాశీలో శివ మాలధారుల రద్దీ



మాల ధరిస్తున్న శివభక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం రెండ్రోజులుగా శివమాలధారులతో కిటకిటలాడుతోంది. వచ్చే నెల 8న మహాశివరాత్రి ఉండటంతో 21 రోజుల పాటు మాలధారణ చేసి నిష్టతో పరమేశ్వరుడి సేవలో తరించేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. వీరంతా గోధుమరంగు దుస్తులు ధరించి స్వామివారి ఆలయంలో అభిషేకాలు చేసి అక్కడి అర్చకులతో శివపంచాక్షరి మహామంత్రోపదేశం చేసుకొని శివదీక్ష చేపడుతున్నారు. అనంతరం అక్కడే ఉన్న నవబ్రహ్మ ఆలయాలను దర్శించుకొని అష్టోత్తర జపాలు చేస్తున్నారు.

బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో శివస్వాముల కోసం ప్రత్యేకంగా అన్నప్రసాదం అందిస్తున్నారు. రుచికరమైన భోజనాలు వడ్డిస్తూ శివదీక్షను ప్రోత్సహిస్తున్నారు. సామాన్య భక్తులకు ఆలయం వెలుపల ప్రత్యేక చలువ పందిళ్లు వేసి వారికి కూడా ఇదే ఆహారం అందజేస్తున్నారు. దీంతో అన్నదాన సత్రానికి భక్తులు విరివిగా విరాళలు కూడా ఇస్తున్నారు. శుక్రవారం నాగర్‌దొడ్డికి చెందిన యుగేంధరరెడ్డి అనే భక్తుడు రూ.10,116 ఇవ్వగా, మహాశివరాత్రి రోజుకు హైదరాబాద్‌కు చెందిన సందీప్ మోతీబార్ అనే దాత ఏకంగా రూ.50 వేలు అందజేశారు.

క్లుప్తంగా

ఇద్దరు సెల్‌ఫోన్ దొంగల రిమాండ్

నాగర్‌కర్నూల్ క్రైం: ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలను రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ రెండో ఎస్‌ఐ రాంచందర్‌జీ శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 14న జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో కర్నూల్ జిల్లా డోన్‌కి చెందిన ఎరుకలి రాజు, ఎరుకలి ఏసులు జిల్లా కేంద్రానికి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సెల్‌ఫోన్‌ను చోరీకి పాల్పడుతుండగా.. ఎరుకలి ఏసును పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఎరుకలి రాజు పరారవ్వగా.. దేవరకద్రలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఇరువురిని విచారించడంతో కొద్ది రోజులుగా సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్నట్లు ఒప్పుకొన్నారు. ఇద్దరి నుంచి 5 సెల్‌ఫోన్లు రికవరీ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ వివరించారు.

పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో మోసం

నవాబుపేట: ఆన్‌లైన్‌లో పార్ట్‌టైం జాబ్ అంటూ వచ్చిన ప్రకటన చూసిన వ్యక్తి వారి మాయమాటలతో మోసపోయి శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు. ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని కూచూర్‌కు చెందిన పిట్టల నాగరాజు గతేడాది డిసెంబర్ నెలలో ఇన్‌స్టాగామ్‌లో అంబిన్స్ అనేపార్ట్ జాబ్ ఉందని దానిలో డబ్బులు పెట్టి వ్యాపారం చేస్తే రూ.లక్షలు సంపాదించవచ్చని సమాచారం పెట్టారు. దీంతో అతడు దాన్ని లాగిన్ చేసి ఫాలో కావటంతో పాటు వారు అడిగిన డబ్బులు వరుసగ రూ.వంద నుంచి రూ.44వేల వరకు మొత్తం రూ.1,89,988 ఆన్‌లైన్ ద్వారా పంపించారు. డబ్బులు పంపడమే తప్పా, తిరిగి రాకపోయో సరికి వారిని ఫోన్ చేస్తే స్పందించలేదు. చాలా సార్లు ప్రయత్నించి చివరికి మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ విషయంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పది ట్రాక్టర్ల ఇసుక డంపు సీజ్

మాగనూర్: మండలంలోని అమ్మపల్లి సమీపంలో సీసీ రోడ్డుకు అక్రమంగా తరలించిన పది ట్రాక్టర్ల ఇసుక డంపును గుర్తించి సీజ్ చేసినట్లు ఆర్‌ఐ శ్రీశైలం తెలిపారు. అడవిసత్యారం గ్రామ పెద్దవాగు నుంచి అనుమతి లేకుండా గురువారం రాత్రి ఇసుక తరలిస్తున్నట్లు గ్రామస్తుల ఫిర్యాదు చేశారన్నారు. ఇసుక డంపు వద్దకు వెళ్లి పరిశీలించగా అక్కడ అనుమతులు లేని ఇసుక ఉన్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ధరూరు: పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. మండలంలోని పారుచర్ల స్టేజీ సమీపంలోని గుట్ట వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు శుక్రవారం సాయంత్రం అక్కడికి చేరుకున్నారు. ఇద్దరు వ్యక్తులు దొరకగా.. మరోకరు పరారమైనట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారిలో కేటీదొడ్డి మండలం పాతపాలెం చెందిన కుంటెన రాములు, ధరూరుకు చెందిన చాకలి శ్రీనివాసులు ఉన్నారు. ఇక పరారైన వారిలో ధరూరుకు చెందిన చాకలి రమేష్, రవి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. మూడు బైక్‌లు, రూ.2,350 నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గట్టుతిమ్మప్ప గోవిందా.. గోవింద

- భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవం
- అశేష భక్తజన సందోహం మధ్య బ్రహ్మోత్సవాలు



మాద్వార్‌లో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

మక్తల్: మండలంలోని మాద్వార్‌లో తిరుమల తిరుపతి స్వామి గట్టుతిమ్మప్పస్వామి (లక్ష్మీవేంకటేశ్వరస్వామి) కల్యాణోత్సవ కార్యక్రమం శుక్రవారం 11 గంటలకు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా, వేదపండితులతో కల్యాణోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం గుట్టపై నుంచి స్వామివారిని కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా పిండివంటలు చేసుకున్నారు. భక్తులు తలనీలాలు తీసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కొండపైకి స్వామివారిని దర్శించుకోడానికి వెళ్లేటప్పుడు భక్తులు గట్టు తిమ్మప్ప గోవిందా... గోవిందా అంటూ స్వామి వారి నామస్మరణతో వెళ్లారు. మరికొందరు కోనేరులో స్నానం చేసుకుని గుట్టపైకి పచ్చిదుస్తులతో వెళ్లి మొక్కు చెల్లించుకున్నారు. జాతరకు సోలాపూర్, ముంబయి, మధ్యప్రదేశ్, హైదరాబాద్, పుణె తదితర ప్రధాన పట్టణాల నుంచి భక్తులు, గతంలో కంటే ఈ సారి అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారి ఉత్సవాలకు వివిధ ప్రాంతాలతో పాటు చుట్టపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. గ్రామస్తుల సహకారంతో రక్తదాన శిబిరం ప్రారంభించారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాజేశ్వర్ రావు తదితర భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



మాద్వార్‌లో రథోత్సవం లాగుతున్న భక్తులు

రథోత్సవాన్ని సాయంత్రం 6 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొండ పైనుంచి లక్ష్మీవేంకటేశ్వరస్వామిని తీసుకొచ్చి రథోత్సవంపై కూర్చోబెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల ఆంజనేయస్వామి దేవాలయం వరకు రథాన్ని వేలాది మంది భక్తులు ముందుకు లాగారు. ఈ రథాన్ని సుందరంగా పూలతో అలంకరించారు. ఆలయ నిర్వాహకులు మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ రాజేశ్వర్‌రావు భక్తులు పాల్గొన్నారు.

కర్నిలో గుండురంగస్వామి రథోత్సవం..

మండలంలోని కర్ని శివారులోని ఓకగుండులో గుండురంగ స్వామి రథోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం 6 గంటలకు ఉత్సవ మూర్తి విగ్రహాన్ని ఊరేగింపుగా రథం వరకు తీసుకువచ్చారు. భక్తులు ఉత్సవ వేడుకల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

పాతసామగ్రి గోదాంలో భారీ అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం ఎదురుగా ఉన్న ఓ పాత సామాను గోదాంలో శుక్రవారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పాటు ఆ ప్రాంతమంతా పొగ వ్యాపించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన ఖాజా పాతసామాన్లు, వాహనాల విడి భాగాలను సేకరించి గోదాంలో నిల్వ చేశారు. శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి సిగరేటు తాగి పక్కనే వేయడంతో ఆయిల్, కాగితాలు, ఇతర సామగ్రికి నిప్పంటుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగి పొగ వ్యాపించడంతో గోదాం సమీపంలో ఉన్న ఇళ్ల వారు ఉలిక్కిపడ్డారు. ఏం జరుగుతుందోనని ఇళ్ల నుంచి రోడ్డుపైకి వచ్చారు. బాటసారులు, వాహనదారులు గమనించి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన వచ్చిన అగ్నిమాపక సిబ్బంది అతికష్టం మీద మంటలను ఆర్పారు. దీంతో పెద్ద ప్రమాదమే తప్పింది. కాసేపు వాహన రాకపోకలకు అంతరాయం కలిగినా పోలీసులు వెంటనే సరిచేశారు. సుమారు రూ. 5లక్షల నుంచి రూ.8లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని గోదాం యజమాని ఖాజా తెలిపారు.

సవాల్‌కు సిద్ధమా?



న్యాయయాత్రలో ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి

నవాబుపేట బాలానగర్: పాలమూర్– రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 80 శాతం పూర్తి చేసినట్లు రుజువుచేస్తే ఎక్కడైనా సరే ముక్కు నేలకు రాసేందుకు నేను సిద్ధంగా ఉన్నాని.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సిద్ధమా అని ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి సవాల్ విసిరారు. శుక్రవారం పాలమూరు న్యాయ యాత్రను మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయంలో డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డితో కలిసి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టుపై అబద్దాలు మాట్లాడారని విమర్శించారు. ఈ ప్రాజెక్టుతో 1.46 లక్షల ఎకరాలకు నీరందించాల్సి ఉండగా ఒక్క ఎకరం కూడా పారడం లేదన్నారు.

సీఎంకు సవాల్ అంటూ..

పాలమూర్ ప్రాజెక్టు విషయంలో మాజీ సీఎం కేసీఆర్‌కు సవాల్ విసురుతున్నట్లు అనబోయి సీఎంకు సవాల్ అంటూ మాట్లాడారు. ఈ మాటలు సోషల్ మీడియాలో హల్‌చల్ అయ్యాయి.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం..

కాంగ్రెస్ పాలనలోనే అన్ని గ్రామాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, మల్లురవి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే దుందుభిపై చెక్‌డ్యాంలు నిర్మించి ఉమ్మడి మండలాన్ని కొంతమేర సస్యశ్యామలం చేశారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వీరన్నపల్లి, ఉడిత్యాల, జీడిగుట్టతండా, గుండేడ్ గ్రామాల మీదుగా బాలానగర్‌కు పాలమూరు న్యాయ యాత్ర సాగింది. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు శంకర్‌నాయక్, తిరుపతి, వెంకటేశ్వర్‌రెడ్డి, సాధువెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలి



ఆందోళన చేస్తున్న కార్మికులు

పాలమూరు: కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా శుక్రవారం భారత్‌బంద్ సందర్భంగా గంటపాటు విధులు బహిష్కరించి సమ్మెకు మద్దతు ప్రకటించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీస్‌గా మార్చాలన్నారు. ఈఎస్‌ఐలో జీఓ నంబర్ 126అమలు చేయాలని, సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. జీఓ నెంబర్ 60ప్రకారం ఆస్పత్రి కార్మికులకు రూ.15,600 వేతనం చెల్లించాలని, ఏజెన్సీ విధానం రద్దు చేసి నేరుగా ప్రభుత్వం వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, సురేష్, కోటేశ్వర్‌రెడ్డి, కిశోర్, కరుణాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా క్షేత్రస్థాయి ఆవిష్కరణలు



ఆవిష్కరణలను పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/ మహబూబ్‌నగర్ (వ్యవసాయం): రైతులు, ఆవిష్కర్తల మధ్య సత్సంబంధాలను పెంపొందించుకోవడానికి వన్‌డే.. వన్ ఎగ్జిబిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ రవి నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని శిల్పారామంలో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్‌ఐసీ), నాబార్డు సంయుక్త ఆధ్వర్యంలో 'వన్ డే– వన్ ఎగ్జిబిషన్'ను ప్రారంభించారు. ఇందులో భాగంగా వ్యవసాయం, నీటి వ్యవస్థ, వ్యర్థాల నిర్వహణ, పాడి పరిశ్రమ, గ్రామీణ సంఘాలను మెరుగుపర్చడానికి మార్గాలను కనుగొన్న 30 మంది ఆవిష్కర్తల నుంచి వచ్చిన కొత్త ఆలోచనలు, ప్రదర్శనలను వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయి ఆవిష్కరణల ప్రదర్శన రైతులకు అండగా నిలుస్తుందన్నారు. ఈ ఆలోచనలు వారిలో మార్పు కలిగిస్తాయన్నారు. గ్రామీణ స్థాయి ఆవిష్కరణలకు మార్కెట్‌ను ఏర్పాటు చేయడంలో పురోగతిని సూచిస్తుందన్నారు. ఈ ప్రదర్శనలు ముఖ్యంగా ఆవిష్కర్తలు, లబ్ధిదారుల మధ్య విలువైన సంబంధాలను సులభతరం చేస్తుందన్నారు. రైతులు, స్థానిక సంఘాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి ఈ వినూత్న పరిష్కారాలను స్వీకరించి అమలు చేయడంపై చర్యలను ప్రోత్సహిస్తాయన్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధిలో వినూత్న పరిష్కారాల విస్తరణ, రైతులు, స్థానిక కార్మికులకు శారీరక శ్రమను తగ్గించడం, తక్కువ ధర స్థిరమైన పరిష్కారాలపై అవగాహన పెరుగుతుందన్నారు. కాగా 750 మందికి పైగా రైతులు, ఆసక్తి కలిగిన ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం షణ్ముఖచారి, ఏడీఎం అఖిల్ పున్నా, టీఎస్‌ఐసీ ప్రతినిధి సోహెల్ తదితరులు పాల్గొన్నారు.


పొట్టేళ్ల పోటీలు



అయిజ మండలం తొత్తినోనిదొడ్డి గుండ్ల భీమరాయస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అంతర్రాష్ట్ర పొట్టేళ్ల పోటీలు నిర్వహించారు. నంద్యాల జిల్లా వాడాల సునీతకు చెందిన పొట్టేలు ప్రథమ స్థానంలో, అదేజిల్లా నందికొట్కూరు మండలం దామగట్లకు చెందిన పంచకళ్యాణి పొట్టేలు ద్వితీయ, జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం భూంపురానికి చెందిన రాము పొట్టేలు తృతీయ స్థానంలో నిలిచాయి.

– అయిజ

మన శరీరంలో పేరుకుపోయే వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు పంపించేందుకు కిడ్నీలు ఎప్పుడూ శ్రమిస్తూనే ఉంటాయి. అందుకుగాను మనం తగినంత నీటిని తాగడంతోపాటు కిడ్నీలను సురక్షితంగా ఉంచే ఆహారాలను తీసుకోవాలి. అయితే కొందరిలో పలు కారణాల వల్ల కిడ్నీ సమస్యలు వస్తుంటాయి. ఈ క్రమంలోనే వారిలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేమిటో తెలుసుకుంటే ముందే జాగ్రత్త పడవచ్చు. ఆ లక్షణాలేమిటో తెలుసుకుందాం.



మీ కిడ్నీలు కుశలమేనా?

తరచూ మూత్రానికి వెళ్లాల్సి వస్తే దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి. అయితే డయాబెటిస్ ఉన్నవారిలో సహజంగానే ఇలా జరుగుతుంది. కనుక ఆ వ్యాధి ఉందో, లేదో చెక్ చేయించుకోవాలి. ఒకవేళ డయాబెటిస్ లేకపోయినా మాటిమాటికీ మూత్రానికి వెళ్లాల్సి వస్తుందంటే.. దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి.

- కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో ముఖం అంతా వాపులకు గురై ఉబ్బిపోయి కనిపిస్తుంది. కాలి మడమలు, కాళ్లు, పాదాలు, చేతులు ఉబ్బిపోయి కనిపిస్తాయి
- కిడ్నీ సమస్యలు ఉంటే తీవ్రమైన అలసట వస్తుంది. కొందరిలో రక్తహీనత సమస్య కూడా ఏర్పడుతుంది
- చర్మం పొడిగా మారి దురదలు పెడుతుంది
- నోటి దుర్వాసన ఉంటుంది
- కిడ్నీ సమస్యలు ఉంటే కొందరిలో జ్ఞాపకశక్తి తగ్గుతుంది. కొందరికి తల తిరిగినట్లు అనిపిస్తుంది
- కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో వెన్ను నొప్పి వస్తుంటుంది
- వాంతి వచ్చినట్టుగా... వికారంగా అనిపిస్తుంది
- కిడ్నీ సమస్యలు ఉంటే శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది
- కిడ్నీ సమస్యలు ఉన్నవారు వేడి వాతావరణంలో ఉన్నప్పటికీ చలిగా అనిపిస్తుంది. కొందరు వణుకుతారు.

టపైన తెలిపిన లక్షణాలు కనుక ఎవరిలో అయినా ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి వారి సలహా మేరకు సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి. అవసరం అయితే మందులను వాడాల్సి ఉంటుంది. దీంతో పాటు కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచే ఆహారాలను తినాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

వెడ్డింగ్ ప్లాన్

సింపుల్‌గా... సూపర్‌గా..!

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. అంటే మన సమాజంలో ఈ రెండు విషయాలూ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న విషయాలన్నమాట. ఎందుకంటే ఒకవైపు ఖర్చు ఎంత పెట్టినా ఇంకా పెట్టాలేమో అన్నట్లుగా ఉంటుంది. ఎక్కడ పెంచాలో.. ఎక్కడ తగ్గించుకోవాలో అర్థం కాదు.. సరైన ప్లానింగ్ లేకపోతే అంతా గందరగోళమే. చివరికి తడిసి మోపడమవడం ఖాయం. తీరా అంత ఖర్చు పెట్టాక మనసుకు సంతృప్తి లేకపోతే మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే పెళ్లి విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరం.



భారతీయ సంప్రదాయంలో పెళ్లికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. కన్యాదాత ఎంతో హంగు, ఆర్భాటాలతో పెళ్లి చేస్తాడు. ఒకోసారి వరుడి తరపు వారే పెళ్లి ఖర్చులు పెట్టుకోవడం, లేదా ఖర్చును ఇద్దరూ కలిసి పంచుకోవడం... ఏ రకంగా చూసినా సరే, జీవితంలో ఒక్కసారే జరిగే సంబరం కావడంతో ఖర్చుకు ఎక్కడా వెనుకాడరు. పెళ్లి శుభలేఖ దగ్గర నుంచి.. మండపాలంకరణ వరకు, పెళ్లిబట్టల నుంచి నగల వరకు; టిఫిన్ల దగ్గర నుంచి విందు భోజనాల వరకు... ఇలా ప్రతిదీ ఖర్చుతో కూడుకున్నదే. భారతీయులు సగటున పెళ్లికోసం చేస్తున్న ఖర్చు రూ. 5 లక్షల నుంచి రూ. కోటికి పైగా ఉంటుందన్నది ఒక అంచనా.



ఇల్లలకగానే పండగా... అన్నట్లు ఉన్నదంతా వదిలించుకుని లేదా లేకపోతే అప్పులు చేసి మరీ పెళ్లి చేసిన తర్వాత ఆ జంట కాపురం కోసం మరి కొంత ఖర్చు చేయాల్సి వస్తుంది. ఏది తక్కువైనా నవ్వుల పాలు కావడం ఖాయం. అయితే వైభవంగా పెళ్లి చేయడం వరకు తప్పేం లేదు కానీ స్తోమతకు మించి అప్పులు చేయడంలోనే అభ్యంతరం... తప్పనిసరి వాటికి ఎలాగూ ఖర్చు తప్పదు కానీ కాస్త ఆచి తూచి ప్లాన్ ప్రకారం చేస్తే పెళ్లికి అయ్యే వృథా ఖర్చును కొంత తగ్గించవచ్చు. అదెలాగో చూద్దాం...



ముందస్తు ప్రణాళిక ...
పెళ్లి ఎంత గ్రాండ్ గా చేశాం అనే దానికన్నా ఎంత ప్రణాళికాబద్ధంగా ఆర్గనైజ్ చేశామన్నది ముఖ్యం. అనుకున్న బడ్జెట్ లోపు చేయాలంటే ఖర్చు ఎక్కడ పెట్టాలి.. ఎక్కడ తగ్గించుకోవాలో ముందుగానే నిర్ణయించుకోవాలి. ఇందుకోసం పెళ్లి తంతులో వివిధ ఘట్టాలకు అవసరమైన వస్తు సామగ్రిని ముందుగానే జాబితా రాసుకోవాలి. అవసరమైతే మండపం, అలంకరణ, కేటరింగ్ వంటి వాటిని ఒకరికే కాంట్రాక్ట్ ఇస్తే కొంతమేరకు ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే పర్యవేక్షణ కూడా బావుంటుంది. వస్త్రాలు, నగలు కూడా అవసరం మేరకే కొనుగోలు చేయాలి.

అతిథుల జాబితా అన్నింటికన్నా ముఖ్యం...
పెళ్లి అంటేనే సకుటుంబ సపరివారంతోపాటు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అంతా హాజరు కావాలని అందరూ కోరుకుంటారు. అందుకోసం బంధువులకు ఒకటని, మిత్రులకు మరొకటని కార్డులు ప్రింట్ చేయిస్తుంటారు. ఇక్కడ కూడా ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంటుంది. అందరికీ కామన్‌గా ఒకే ఆహ్వాన పత్రిక ఉంటే ఖర్చు తగ్గుతుంది. సేహితులకు కార్డులు కొట్టించే బదులు ఈ ఇన్విటేషన్ల ద్వారా కూడా ఆహ్వానం పంపుకోవచ్చు. అలాగే పెళ్లిలో మెహందీ అని, సంగీత్ అని, హల్దీ అనీ, రిసెప్షన్ అనీ ఇలా చాలా రకాల ఈవెంట్స్ చేస్తున్నారు. పెళ్లికూతురు దగ్గర కొన్ని, పెళ్లి కొడుకు వద్ద మరికొన్ని.. ఇద్దరిని కలిపి కొన్ని ఈవెంట్స్ ప్లాన్ చేస్తున్నారు. వీటికి ఎవరెవరిని పిలవాలనే దానిపై కూడా కసరత్తు చేయాలి. అప్పుడు ఏ ఈవెంట్ కు ఎంతమంది వసారో అవగాహన ఉంటుంది కాబట్టి.. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలి.

ముందుగా బడ్జెట్ వేసుకోండి... పెళ్లికి ముందు బడ్జెట్ సిద్ధం చేసుకోవాలి. బడ్జెట్ లేకుండా వెడ్డింగ్ ఫంక్షన్ నిర్వహిస్తే ఖర్చులు భారీగా ఉంటాయి. మీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ సిద్ధం చేసుకోవడం మొదటి పని. వివాహం అలా చేసుకోవాలని ఇలా చేసుకోవాలని చాలా కోరికలు ఉంటాయి. కానీ అవసరమైన వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని గుర్తుంచుకోండి. ఉదాహరణకు వివాహానికి బట్టలు, ఆభరణాలు అవసరం. అలాగని ఖరీదైన బట్టలు, ఆభరణాలు అవసరం లేదు. బడ్జెట్‌లో వచ్చే వాటిని తీసుకోవడం ఉత్తమం.

క్యాటరింగ్: పెళ్లి విందులకు డబ్బు గుడ్డిగా ఖర్చు చేస్తారు. చాలా పెళ్లిళ్లలో ఆహారం వృథా అవడం గమనిస్తూనే ఉంటాం. వివాహ విందు మెనులో అవసరమైన ఆహార పదార్థాలను మాత్రమే చేర్చండి. లేనిపోని గొప్పల కోసం మెనూని పెంచవద్దు. హాజరయ్యే అతిథుల సంఖ్యకు అనుగుణంగా క్యాటరింగ్ సిద్ధం చేసుకోవాలి.



అలంకరణ సామగ్రి
పెళ్లి ఇంట్లో చాలా అలంకరణ ఉంటుంది. అవసరమైన అలంకరణ వస్తువులు మాత్రమే తీసుకోవాలి. వీటిలో పువ్వులు చాలా ముఖ్యమైనవి. వాటిని చౌకగా ఉన్న ప్రదేశాల నుంచి కొనుగోలు చేస్తే కొంత డబ్బు ఆదా అవుతుంది.



హనీమూన్ ట్రిప్... పెళ్లితంతు ముగిసిన తర్వాత నూతన వధూవరుల హనీమూన్ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. హనీమూన్ డెస్టినేషన్లుగా పేరుగాంచిన దేశాలకు ఎగిరిపోతున్నారు. ఇది కూడా బడ్జెట్ పెరగడానికి కారణం అవుతుంది. దీని బదులుగా మన దేశంలోనే అనువైన ప్రాంతాలను ఎంచుకుంటే చాలా సమయంతో పాటు ధనమూ ఆదా అవుతుంది. ఒకవేళ విదేశాలకే వెళ్లాలనుకుంటే తక్కువ ఖర్చుతో వెళ్లి రాగలిగే మలేసియా, థాయ్‌ల్యాండ్ వంటివి ఎంచుకుంటే సరిపోతుంది.

లైఫ్@360




శరీరంలో స్రవించే హార్మోన్లలో ఒక్కోసారి చోటు చేసుకునే కొన్ని రకాల అసమతౌల్యతల కారణంగా చాలా ఒత్తిడికి లోనవుతుండటం లేదా మూడ్ ఆఫ్ కావడం మామూలే. అయితే దాన్ని సరిచేయడానికి మందులు మింగే బదులు కొన్ని ఆహారాలను తీసుకోవడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాలు దృఢంగా ఉంటాయి. ఆ ఆహారాలేమిటో తెలుసుకుని, మూడ్ బాగుండనప్పుడు వాటిని తీసుకుంటే సరి!

మూడ్‌ని మార్చే ఫుడ్



ఒక్కొక్కసారి మనకు తెలియకుండానే మూడ్ పాడవుతుంది. ఏదో పోగొట్టుకున్నట్లు... వెలితిగా... ఒకలాంటి బాధగా అనిపిస్తుంది. అలాంటప్పుడు కొన్నిరకాల ఆహారాలను తీసుకోవడం వల్ల వెంటనే మూడ్ సరవుతుంది. అవేమిటో తెలుసుకుందాం...

పాలకూర.. ఐరన్ పాళ్లు అధికంగా ఉండే పాలకూర సంతోషకరమైన హార్మోన్లను పెంచడానికి పనిచేస్తుంది. అంతేకాదు, ఇందులో ఫైబర్, విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థకు, చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. పాలకూర స్మూతీ, సూప్ లేదా పాలకూరను ఏదో ఒక రూపంలో ఆహారంలో తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది.



మష్రూమ్స్.. మష్రూమ్స్ యాంటి డిప్రెసెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇందులో సమృద్ధిగా ఉండే విటమిన్ డి మానసిక స్థితిని నియంత్రిస్తుంది. ఇది సెరటోనిన్ సంశ్లేషణ స్థాయికి సంబంధించినది. దీని కారణంగా వ్యక్తి సంతోషకరమైన భావోద్వేగాలను అనుభవించగలడు. మీ మూడ్ ఆఫ్‌లో ఉన్నప్పుడు, మష్రూమ్ రెసిపీని తినడం వల్ల తిరిగి మంచి మూడ్‌లోకి వచ్చేసే అవకాశం మెండుగా ఉంది. ప్రయోజనకరంగా ఉంటుంది.

అవకాడో.. కొద్దికాలం క్రితం నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం అవకాడోలో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఉండే విటమిన్ బి3 ,ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు సంతోషకరమైన హార్మోన్ అయిన సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడతాయి. రోజంతా సంతోషంగా ఉండటానికి సలాడ్, శాండ్‌విచ్ లేదా అల్పాహారంలో అవకాడోను చేర్చవచ్చు.



డ్రై ఫ్రూట్స్.. ప్రతిరోజూ కొన్ని బాదం లేదా వాల్‌నట్‌లను తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది, ఒత్తిడి తగ్గుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల ఇలా జరుగుతుంది.

డార్క్ చాకొలేట్.. ఓ నివేదిక ప్రకారం డార్క్ చాకొలేట్ తినడం వల్ల శరీరంలో సంతోషకరమైన హార్మోన్ల స్థాయి పెరుగుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. ఇందులో ఉండే ట్రిప్టోఫాన్ సెరోటోనిన్ స్థాయిలను పెంచుతుంది. ఫలితంగా వెంటనే మూడ్ సరవుతుంది. మూడ్ బాగుండనప్పుడు ఈ ఫుడ్ ప్రయత్నించండి.



సినిమా

దేవర డేట్ ఫిక్స్



● ఎన్టీఆర్

రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్నాడు 'దేవర'. ఈ ఏడాది అక్టోబరు 10న 'దేవర' చిత్రం తొలి భాగం విడుదల కానుంది. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబోలో వస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. కాగా తొలి భాగాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ వాయిదా వేశారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో అక్టోబరు 10న సినిమాని విడుదల చేయనున్నట్లు శుక్రవారం వెల్లడించారు మేకర్స్.

ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం



● రాజేంద్రప్రసాద్, జయప్రద

'ఈ ప్రపంచం మన ప్రేమని తిరస్కరిస్తే.. ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం' (రాజేంద్ర ప్రసాద్), 'అందరూ నన్ను ఏడిపించినవాళ్లే.. కానీ, నాకోసం ఏడ్చింది నువ్వు ఒక్కడివే' (జయప్రద) వంటి డైలాగులు 'లవ్ @65' మూవీ ట్రైలర్‌లో ఉన్నాయి. రాజేంద్ర ప్రసాద్, జయప్రద ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లవ్ @65'. వీఎస్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కార్తీక్ రాజు, స్పందన పల్లి ముఖ్య పాత్రలు పోషించగా, సునీల్, అజయ్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానున్న సందర్భంగా శుక్రవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. 'రాత్రి ఇక్కడి నుంచి ఇద్దరు మిస్ అయిపోయారు సార్', 'ఎవరు', 'మా కావేరి సార్.. మా ఆది సార్', 'ఎలా మిస్సయ్యారు', 'వాళ్లు లేచిపోయారు సార్', 'ఇద్దరూ మేజర్లా', 'కాదు సార్.. ఆయనకి డెబ్బై నిండాయి.. ఆవిడకి ఓ అరవైఐదు దాక ఉంటాయి'.. వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ తుమ్మలపల్లి, సంగీతం: అనూప్ రూబెన్స్.

అన్యాయంపై పోరాటం



● అనుష్క

'అరుంధతి', 'భాగమతి'.. ఇలా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో తనదైన శైలిని చాటుకుని సక్సెస్ అయ్యారు అనుష్క. తాజాగా ఆమె కథానాయిక ప్రాధాన్యంగా సాగే మరో సినిమా అంగీకరించారు. క్రిష్ (జాగర్లమూడి రాధాకృష్ణ) ఈ సినిమాకు దర్శకుడు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఒడిశాలోని ఒక మహిళ జీవితంలో పదేళ్ల క్రితం జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందుతోందని సమాచారం. తనకు జరిగిన అన్యాయంపై పోరాటం చేసే ఓ సాధారణ అమ్మాయిగా అనుష్క పాత్ర ఉంటుందట. ఇటీవల ఒడిస్సాలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్నారని తెలిసింది. కాగా ఈ సినిమాకు 'శీలవతి' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తోందనే టాక్ వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాలో తమిళ నటుడు విక్రమ్ ప్రభు ఓ లీడ్ రోల్ చేస్తున్నారని, ఈ సినిమా ఈ ఏడాదే దక్షిణాది భాషల్లో విడుదలవుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

మహారాజా?



● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్ర కోసం ఇండోనేషియా బ్యూటీ చెల్సియా ఇస్లాన్, దీపికా పదుకోన్ పేర్లు తెరపైకి వచ్చాయి. ఫారెస్ట్ అడ్వెంచరస్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'మహారాజా', 'మహారాజ్', 'చక్రవర్తి' అనే టైటిల్స్‌ను పరిశీలిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. మరి.. ఫైనల్‌గా ఈ టైటిల్స్‌లో ఏదో ఒకటి ఫిక్స్ అవుతుందా? లేక మరొక టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేస్తారా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. ఇక విజయేంద్రప్రసాద్ కథ అందించిన ఈ చిత్రానికి ఎమ్ఎమ్ కీరవాణి సంగీతదర్శకుడు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది వేసవిలో ఆరంభమవుతుందని టాక్.

మళ్లీ వస్తున్నాడు జోకర్



● 'జోకర్ 2' పోస్టర్

హాలీవుడ్ జోకర్ మళ్లీ వస్తున్నాడు. హాలీవుడ్ మ్యూజికల్ సైకలాజికల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'జోకర్'. జోక్విన్ ఫీనిక్స్ ప్రధాన పాత్రలో టాడ్ ఫిలిప్స్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ సినిమా 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ' సినిమాకు సీక్వెల్‌గా 'జోకర్ 2' (జోకర్: ఫోలీ ఎ డ్యూక్స్)ను ప్రకటించారు టాడ్ ఫిలిప్స్. ఈ చిత్రంలో జోక్విన్ ఫీనిక్స్‌తో పాటు లేడీ గగా మరో లీడ్ రోల్ చేస్తున్నారు. జాజై బీట్జ్ మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారు. లాస్ ఏంజిల్స్, న్యూయార్క్, న్యూ జెర్సీ లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపారు. ఈ చిత్రం ట్రైలర్ ఏప్రిల్ 4న విడుదల కానుం దని హాలీవుడ్ టాక్. సినిమాను ఈ ఏడాది అక్టోబరు 4న విడుదల చేయాలనుకుంటున్నారు. టాడ్ ఫిలిప్స్, బ్రాడ్లీ కూపర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా వార్నర్ బ్రదర్స్ డిస్ట్రిబ్యూట్ చేయనుంది.

థ్రిల్ స్టార్ట్



● మోహన్ భగత్

మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆరంభం'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో వీటీ అభిషేక్ నిర్మిస్తున్న సినిమా ఇది. ఈ సినిమా టీజర్‌ను హీరో నాగచైతన్య విడుదల చేసి, 'బ్యాగ్రౌండ్‌లో రామాయణ స్టోరీని నరేట్ చేస్తూ ఇంటర్‌కట్స్‌లో వేసిన విజువల్స్‌తో టీజర్‌ని డిఫరెంట్‌గా కట్ చేశారు. థ్రిల్లింగ్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆసక్తిగా ఉంది'' అన్నారు.

యుద్ధానికి సిద్ధం!



● హృతిక్ రోషన్

బాలీవుడ్‌లో మరో వార్‌కు సిద్ధం అవుతున్నారు హీరో హృతిక్ రోషన్. ఆయన నటిస్తున్న యాక్షన్ స్పై ఫిల్మ్ 'వార్ 2'. ఎన్టీఆర్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెలాఖర్లో ప్రారంభం కానుంది. హృతిక్ రోషన్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఈ చిత్రం 2025 ఆగస్టు 14న విడుదల కానుంది. 2019లో హృతిక్, టైగర్ ష్రాఫ్‌లు నటించిన 'వార్' సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' వస్తోంది.

రీల్స్

పెళ్లనేది పాన్ ఇండియా సమస్య



● 'అల్లరి' నరేశ్

'ఆ ఒక్కటీ అడక్కు' అంటున్నారు హీరో 'అల్లరి' నరేశ్. ఆయన నటిస్తున్న 61వ చిత్రానికి నూతన దర్శకుడు మల్లి అంకం దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. రాజీవ్ చిలక నిర్మిస్తున్న ఈ సినిమాకి 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్ గ్లింప్స్ విడుదల చేశారు. ఈ మూవీలో నరేశ్ పాత్ర పేరు గణ. అతని పెళ్లి గురించి కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు అడిగితే.. 'ఆ ఒక్కటీ అడక్కు.. పెళ్లనేది పాన్ ఇండియా సమస్య' అంటూ నరేశ్ చెప్పే డైలాగ్స్ గ్లింప్స్‌లో ఉన్నాయి. ''వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది. మార్చి 22న విడుదల చేస్తాం'' అన్నారు మేకర్స్.

గ్రామీణ నేపథ్యంలో...



● యువ చంద్రకృష్ణ

యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె నిర్మించిన ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'వచ్చారే..' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ''గ్రామీణ నేపథ్యంలో కొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'పొట్టేల్'. ఈ చిత్రంలోని భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సందె వేళ...



● శాంతి చంద్ర, దీపికా సింగ్

శాంతి చంద్ర హీరోగా, దీపికా సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రితి హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో గూడూరు భద్రకాళి సమర్పణలో జీయస్ బాబు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. డా. సతీష్ కుమార్ పి. సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సందె వేళ...' అంటూ సాగే పాటని డైరెక్టర్ సాయి రాజేశ్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''నా మిత్రుడు శాంతి చంద్ర నటించిన 'డర్టీ ఫెలో'లోని 'సందె వేళ..' పాట బాగుంది'' అన్నారు. ''వినూత్న కథతో రూపొందిన చిత్రమిది'' అన్నారు శాంతిచంద్ర.

ప్రేమ.. నవ్వులు



● గౌతమ్, పరశురామ్

గౌతమ్ సాగి, దీప్శికా జంటగా చంద్రశేఖర్ కానూరి దర్శకత్వంలో శ్రీధర్ వర్మ సాగి నిర్మిస్తున్న చిత్రం 'రవికుల రఘురామ'. సుకుమార్ పమ్మి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చంద మామే..' అంటూ సాగే పాటని డైరెక్టర్ పరశురామ్ విడుదల చేశారు. ''లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ప్రేక్షకులకు మంచి వినోదాన్ని ఇవ్వాలని తన సృజనాత్మకత మొత్తం జోడించి ప్రాణం పోస్తున్నారు చంద్రశేఖర్'' అని యూనిట్ పేర్కొంది.